క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



లక్ష్మీపురం: మంచి నాయకులను ఎన్నుకోవడానికి, మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ప్రజలకు దక్కిన ఆయుధమే ఓటు హక్కు అని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఓటరు చైతన్య సభ నిర్వహించారు. సభలో విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడుతూ ప్రభుత్వ స్వరూపం, స్వభావం ప్రజలు విజ్ఞతతో వినియోగించిన ఓటుపై ఆధారపడి ఉంటాయన్నారు. విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా ఉండాలంటే ప్రతి పౌరుడు ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మల్లేశ్వరరావు, సైదా పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



గుంటూరు రూరల్: విద్యతో పేదరికాన్ని పారదోలవచ్చని ఎంపీఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ స్కూల్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. శుక్రవారం 41వ డివిజన్ సుందరయ్య కాలనీ సమీపంలోని పాఠశాలలో ఆంధ్ర యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులు పదో తరగతి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన మొదటి బ్యాచ్ విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రస్తుతం 425 మంది విద్యార్థులు స్కూల్‌లో చదువుతున్నారన్నారు. నామమాత్ర ఫీజులతో పేదలకు అందుబాటులో ఉండే విధంగా పాఠశాల నడపబడుతుందని తెలిపారు. పాఠశాల నుంచి ఈ ఏడాది పదో తరగతి మొదటి బ్యాచ్ విద్యార్థులు 13 మంది పరీక్షకు హాజరు కాగా.. అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారన్నారని తెలిపారు. అమృత అనే విద్యార్థిని 576 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.ఉపేంద్ర, ఎల్ఎస్ భార్గవి, ప్రిన్సిపల్ తాండవ కృష్ణ, వైస్ ప్రిన్సిపల్ దివ్య, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు దుర్గాప్రసాద్, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

పెదకాకాని: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పెదకాకాని పాతూరు ఏరియాకు చెందిన షేక్ ముస్తాఫా వంట పనికి, గ్రామంలోని టుబాకో కంపెనీలో కూలీగా వెళ్తూ.. జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున మోటార్‌తో నీళ్లు పట్టాడు. అనంతరం స్విచ్ ఆఫ్ చేసే సమయంలో కరెంట్ షాక్ తగిలి అక్కడే పడిపోయాడు. కుటుంబ సభ్యులు స్థానికంగా ప్రాథమిక చికిత్స అందించి, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే షేక్ ముస్తాఫా(32) మరణించాడు. మృతునికి భార్య మెహరున్నీసా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు. మృతదేహాన్ని పొన్నూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ సందర్శించి, నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

96 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం



తాడికొండ: తాడికొండ అడ్డరోడ్డులో అక్రమంగా తరలిస్తున్న 96 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. వివరాల మేరకు.. పొన్నెకల్లు గ్రామానికి చెందిన సూర్రెడ్డి రామకృష్ణారెడ్డి 96 క్వార్టర్ మద్యం బాటిళ్లతో వెళ్తుండగా.. తాడికొండ అడ్డరోడ్డులో పట్టుకొని ఠాణాకు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం, నగదు పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే తన ఫోన్ నంబరు 86888 31374 నంబరుకు నేరుగా సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

పోలేరమ్మకు కుంకుమ పూజ

కొండపాటూరు(కాకుమాను): మండలంలోని కొండపాటూరులో వేంచేసి ఉన్న స్వయంభూ కొండపాటూరు పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా మంగళవారం అమ్మవారికి కుంకుమపూజ నిర్వహించారు. అర్చకులు వంశీ బృందం ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేక పట్టు వస్త్రాలతో అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు కంఠమనేని నరేష్, దేవాలయ ఈఓ బత్తుల సురేష్ బాబు పర్యవేక్షించారు.

టీడీపీకి ఓటమి భయం

- పశ్చిమలో గెలిచేది వైఎస్సార్ సీపీనే
- వైఎస్సార్ సీపీపై ప్రజల అభిమానాన్ని ఓర్చుకోలేకపోతున్నారు
- ఎవరెన్ని కుట్రలు పన్నినా ప్రజల మద్దతు జగనన్నకే
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- గుంటూరు 36వ డివిజన్‌లో మనతో మన రజినమ్మ కార్యక్రమం



ప్రచారంలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి విడదల రజిని

పట్నంబజారు: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఓటమి తప్పదని గ్రహించే తెలుగుదేశం పార్టీ కుట్రలకు తెరలేపిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు వెస్ట్ అభ్యర్థి విడదల రజిని దుయ్యబట్టారు. గుంటూరు నగరం 36వ డివిజన్‌లో శుక్రవారం సాయంత్రం మనతో మన రజినమ్మ కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకూ వెళ్ళి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రజలు తనపై చూపుతున్న ఆదరాభిమానాలు చూసి ఓర్వలేక టీడీపీ వీధి నాటకాలకు తెర దీశారని మండిపడ్డారు. ఎన్ని కుట్రలకు పాల్పడినా ప్రజలు మాత్రం వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని తెలిపారు. జగనన్న పాలనలో ప్రజలంతా ఎంతో సంతోషంతో ఉన్నారని, ప్రజలంతా ఫ్యాను గుర్తుకు ఓటేసి గెలిపించబోతున్నారని స్పష్టం చేశారు. జగనన్న ఐదేళ్ల తన పాలనలో ప్రజలకు ఎంత చేయాలో అంతా చేశారని చెప్పారు. అన్నివర్గాల ప్రజల మెప్పు పొందిన ఏకైక ప్రభుత్వం తమదేనని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా తమ పాలన కొనసాగిందని పేర్కొన్నారు. మరోసారి జగనన్నను గెలి పించుకోవాలనే నిర్ణయానికి రాష్ట్ర ప్రజలు వచ్చేశారని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం వంటి కీలక రంగాల్లో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి బంగారు భవిష్యత్ దిశగా రాష్ట్రాన్ని తీసుకెళుతున్న గొప్ప నాయకుడు సీఎం జగనన్న అని అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గెలిచేది వైఎస్సార్ సీపీనేనని, ఆ తర్వాత నగరాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసేది కూడా తామేనని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి రజిని, డివిజన్‌లోని తోళ్ల షాపు సెంటరు, షాదీఖానా, రాజ్యలక్ష్మీనగర్, వడ్డెర కాలనీ, నర్సిరెడ్డి పాలెం, కృష్ణదేవరాయనగర్, మహా ప్రస్థానం వెనుక వైపు, భాగ్యనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఉడుముల లక్ష్మి, పార్టీ నాయకులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, దుగ్గెంపూడి వెంకట్రామిరెడ్డి, ఉడుముల అప్పిరెడ్డి, షేక్ మియా సాహెబ్, ఇమామ్, వీరాస్వామి, మస్తాన్‌వలి, పండు, పొగర్తి కృష్ణ, అంజినాయక్, మహంకాళి బాలయ్య, విజయ్, రాములు, వీరాస్వామి, హరి, సుభాని, ఇమాం, దాసు, నరసయ్య లాజర్, రాజు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ హయాంలో బీసీలకు అగ్ర తాంబూలం

నెహ్రూ నగర్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో బీసీల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కె.వెంకటనారాయణ ముదిరాజ్ పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినిని శ్యామల నగర్‌లోని ఆమె నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతోందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో ఉన్న బీసీ అభ్యర్థులందరినీ గెలిపించుకోవడంతో పాటు వైఎస్ జగన్ ను తిరిగి ముఖ్యమంత్రి చేసుకునేందుకు బీసీలంతా సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో ముదిరాజ్ మహాసభ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సాంబశివరావు, స్టేట్ సెక్రటరీ చాపల రాజశేఖర్, రాఘవ, కోటి, చంద్ర, శ్రీను పాల్గొన్నారు.



మంత్రి రజినిని సత్కరిస్తున్న ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ వెంకటనారాయణ

అలరిస్తున్న నృత్య ప్రదర్శనలు

భక్తి పారవశ్యంలో ముంచెత్తిన విప్రనారాయణ చరిత్ర



విప్రనారాయణ చరిత్రలో ఓ దృశ్యం

నగరంపాలెం: అంతర్జాతీయ నృత్య దినోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 23న ప్రారంభమైన నృత్య ప్రదర్శనలు సభికులు, ప్రేక్షకులను అలరిస్తున్నాయి. పలు రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శిస్తున్న నృత్యాలు ఆకట్టుకుంటున్నాయి. శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై నిర్వహిస్తున్న వేడుకలు శుక్రవారం నాలుగో రోజుకి చేరాయి. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేయగా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. 17వ శతాబ్దపు పాలకుడు శ్రీ విజయ రాఘవ నాయకుడు రచించిన 'విప్రనారాయణ చరిత్ర' యక్షగానం ప్రేక్షకులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యం నృత్య దర్శకునిగా, విప్రనారాయణుని శిష్యునిగా, సూత్రధారిగా, విప్రనారాయణునిగా తేరల శ్రావణ్‌కుమార్, దేవ దేవిగా పటకమూరి సుప్రియ, దేవ దేవి తల్లిగా పూల భరణి, సోదరిగా పచ్చల నాగమహిత, విజయ రాఘవునిగా నాత్యాచార్య బాలు, రంగ మన్నారుగా అక్షయరెడ్డి, రాజా నర్సకి మనులుగా నారా హర్షిని, జమ్ముల కుసుమాంజలి, కె.తన్మయశ్రీ, గరికపాటి శ్రీ అన్నయ్య, ఆదిరాజు కృత్తిక, తంజావూరు నర్తకిగా తాళ్లూరి ధరణి అద్భుతంగా తమ పాత్రలను పోషించారు. కార్యక్రమాన్ని ఈశ్వర వరప్రసాద్ పరిషత్తు(గుంటూరు) సమర్పించగా, ప్రముఖ చిత్రకారులు రాయన గిరిధర్ గౌడ్ తో పాటు వెంకటగిరి నాగలక్ష్మి, మోదుగుల రవికృష్ణ పాల్గొన్నారు.

రేపు టెన్త్ విద్యార్థులకు మాస్టర్ మైండ్స్ ప్రతిభా పురస్కారాలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి ఇటీవల ప్రకటించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈనెల 28న ప్రతిభా పురస్కారాలు బహూకరిస్తున్నట్లు మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి స్టేట్ సిలబస్‌లో 550కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం ఉదయం 9.00 గంటలకు స్లాట్-1, సాయంత్రం 4.00 గంటలకు స్లాట్-2గా బ్రాడీపేట 3/7లోని పవనపుత్ర క్యాంపస్‌లో ప్రతిభా పురస్కారాల సర్టిఫికెట్‌తో పాటు నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు ఆధార్‌కార్డు, పాఠశాల గుర్తింపుకార్డు, టెన్త్ మార్కుల జాబితా తీసుకుని రావాలని సూచించారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ కోసం 92487 22218, 89784 80385 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

చంద్రబాబు బ్రాహ్మణ ద్వేషి

కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ

లక్ష్మీపురం: చంద్రబాబు బ్రాహ్మణ ద్వేషం మరోసారి బయటపడిందని బ్రాహ్మణ సంఘం నాయకుడు, 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) పేర్కొన్నారు. ఆత్మీయ సమావేశం పేరిట ప్రచురించిన పోస్టర్‌లో ఒక్క బ్రాహ్మణ నాయకుడి ఫొటో కూడా లేకపోవడమే అందుకు నిదర్శనమని శుక్రవారం బ్రాడీపేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెప్పారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి కూడా బ్రాహ్మణ వ్యతిరేక ధోరణితోనే ముందుకు సాగిందని మండిపడ్డారు. బ్రాహ్మణులకు టీడీపీలో అసలు ప్రాతినిధ్యమే లేదనీ.. ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా ఇచ్చిన పాపాన పోలేదని పేర్కొన్నారు.

ఒక్కటైన దివ్యాంగ జంటలు



కళ్యాణ మహోత్సవంతో ఒకటైన దివ్యాంగ జంటలు

నెహ్రూ నగర్: దివ్యాంగుల వివాహ ఇన్ఫో సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రెండు దివ్యాంగ జంటలకు వివాహాలు జరిపించారు. శారదా కాలనీలోని ఓ కల్యాణ మండపంలో కదిరి వెంకటరమణ(గిద్దలూరు), ఎన్.దీపిక(కేసరిపల్లి) జంటకు, షేక్ మహబూబ్ బాషా(గుంటూరు), ఉప్పెర్ల రాజకుమారి(వెస్ట్ గోదావరి) జంటకు బంధుమిత్రుల మధ్య ఘనంగా వివాహం జరిపించారు. ఈ సందర్భంగా సొసైటీ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సిల్వర్ ప్యాలెస్ నిర్వాహకులు సాంబశివరావు, హైకోర్టు అడ్వకేట్ మాధవీలత, వ్యాపారవేత్త మహాలక్ష్మయ్య, తేజలు దివ్యాంగ జంటలను ఆశీర్వదించి కానుకలు అందజేశారు. గత కొద్ది సంవత్సరాలుగా దివ్యాంగ జంటలకు ఎటువంటి లాభాపేక్ష లేకుండా వివాహాలు జరిపిస్తున్నామని సొసైటీ చైర్మన్ నాగశ్రీ తెలిపారు. వివాహం చేసుకోవాలనుకునే దివ్యాంగ జంటలు ఎవరైనా 8555810100 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో సొసైటీ జనరల్ సెక్రెటరీ సురేష్, మాధురి, లక్ష్మీ, సృజన్, భాస్కర్, రాము, సునీల్, మురళి పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి



మృతిచెందిన ఎం.శ్రీనివాసరావు

మేడికొండూరు: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందగా, మరొకరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రమైన మేడికొండూరు జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని బ్రిడ్జి వద్ద జరిగింది. గుంటూరు నుంచి సత్తెనపల్లి వైపు వెళ్తున్న లారీ, సత్తెనపల్లి నుంచి గుంటూరు వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఎం.శ్రీనివాసరావు (45) తీవ్రగాయాలపాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అతని అత్త గుడిపూడి కౌశల్యకు స్వల్ప గాయాలు కాగా, స్థానికులు గమనించి క్షతగాత్రురాలిని ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్‌లో డెప్యూటీ కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు

గుంటూరు మెడికల్: రాబోయే రోజుల్లో గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి పరిపాలన విభాగం అటు ప్రజలకు, ఇటు వైద్యేతర సిబ్బందికి మరింతగా సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. ఆస్పత్రిలో ఏఓ కార్యాలయాన్ని మరమ్మతులు చేసి డెప్యూటీ కలెక్టర్ కార్యాలయంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పరిపాలన విభాగంలో అనేక సంస్కరణలు వచ్చాయని అందులో భాగంగా పరిపాలన సౌలభ్యం కోసం మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రిని ఒక యూనిట్‌గా తీసుకున్నారని చెప్పారు. ఇక నుంచి మెడికల్ కళాశాలకు, ఆసుపత్రికి ఒక పరిపాలన విభాగం అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులను నిర్వర్తిస్తారని తెలిపారు. వీరిని పర్యవేక్షణ బాధ్యత డెప్యూటీ కలెక్టర్‌కు అందచేశారన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు డెప్యూటీ కలెక్టర్ రిపోర్ట్ అందిస్తారని వివరించారు. డెప్యూటీ కాల్లెటర్ హోదా పెరగడం వలన పరిపాలన విభాగం బలోపేతమవ్వడమే కాకుండా ఆసుపత్రి సిబ్బందికి సేవలు వేగవంతం అవుతాయని చెప్పారు. ఇక నుంచి వైద్య సిబ్బంది ఫైళ్లు కూడా పెండింగులో లేకుండా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. డీఎంఈ ఆదేశాల మేరకు డెప్యూటీ కలెక్టర్ విధి విధానాలు కూడా ప్రకటించారని చెప్పారు. గత నెల నుంచి డెప్యూటీ కలెక్టర్ కూడా తనతో పాటు కలిసి పర్యవేక్షణ చేస్తుంటారన్నారు.

కల్వరి టెంపుల్ సేవలు ప్రశంసనీయం

కల్వరి టెంపుల్ వద్ద చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ మీరజ్, ఆర్ఐ రాజేశ్వరి

పెదకాకాని: కల్వరి టెంపుల్ సేవలు ప్రశంసనీయమని పెదకాకాని ఎస్ఐ మీరజ్ అన్నారు. మండల పరిధిలోని నంబూరు జాతీయ రహదారి పక్కన గల దైవజనులు డాక్టర్ పి.సతీష్‌కుమార్ కల్వరి టెంపుల్ నందు శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. మజ్జిగ, మంచినీరును అందించడం జరుగుతుందని బాటసారులు సద్వినియోగం చేసుకోవాలని కల్వరి టెంపుల్ సిబ్బంది తెలిపారు. ఎస్సై మీరజ్ మాట్లాడుతూ కోవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలోనూ కల్వరి టెంపుల్ వారు ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సేవలను అందించారని గుర్తుచేశారు. ఆర్ఐ ఎ.రాజేశ్వరి, ఎస్ఐ మీరజ్ పరువురికి మజ్జిగ పంపిణీ చేశారు. కల్వరి టెంపుల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్‌లో కళ్లం విద్యార్థి ప్రతిభ



గుంటూరు రూరల్: నేటి పోటీ ప్రపంచంలో టెక్నికల్ స్కిల్స్ ఎంతో అవసరని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో శుక్రవారం ఏర్పాటు విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. కళాశాల విద్యార్థులు ఇటీవల పల్నాడు జిల్లా నరసరావుపేటలోని జేఎన్‌టీయూకే కళాశాలలో నిర్వహించిన కంప్యూటర్ కోడింగ్ పోటీల్లో ప్రతిభ చాటారన్నారు. విద్యార్థిని పి.హర్షప్రియ ప్రథమ బహుమతిని సాధించిందని తెలిపారు. పలువురు బహుమతులు స్వీకరించినట్లు చెప్పారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ వి.రాజీవ్‌జట్సన్, అధ్యాపకులు అభినందించారు.

పశ్చిమలో 31 నామినేషన్లు ఆమోదం



రాజకీయ పార్టీ అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లను పరిశీలిస్తున్న పశ్చిమ ఆర్ఓ రాజ్యలక్ష్మి

నెహ్రూనగర్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 31 నామినేషన్లు ఆమోదించినట్లు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ మేరకు శుక్రవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి దాఖలైన 55 నామినేషన్లను పరిశీలించామని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సరైన ధ్రువ పత్రాలు, అవసరమైన డాక్యుమెంట్స్ లేని 8 నామినేషన్లను తిరస్కరించగా 47 నామినేషన్లను ఆమోదించినట్లు పేర్కొన్నారు. 47 నామినేషన్లలో డమ్మీలుగా, అదనపు నామినేషన్ సెట్లు దాఖలు చేసిన వాటిని అభ్యర్థుల సమక్షంలోనే తిరస్కరించుట జరిగిందన్నారు. నామినేషన్ల పరిశీలన అనంతరం గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి 31 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. ఈ నెల 27, 29వ తేదీలలో ఉపసంహరణ అనంతరం 29న తుది జాబితా వెల్లడించనున్నట్లు వివరించారు.

మే ఒకటి వరకు పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం

నెహ్రూ నగర్: గుంటూరు జిల్లాలో ఎన్నికల విధులు కేటాయించబడిన శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వివరాలతో దరఖాస్తు చేసుకునేందుకు మే ఒకటి వరకు ఎన్నికల కమిషన్ గడువు పొడిగించిందని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అదర్ పోలింగ్ ఆఫీసర్స్(ఓపిఓ)గా ఎన్నికల విధులు కేటాయించబడిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీలు, కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్‌ను మే ఒకటి వరకు వినియోగించుకునేలా గడువు పొడిగిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కోసం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్ డెస్క్ లో ఫారం-12(2 కాపీలు) అందించాలన్నారు. ఫారం-12తో పాటు ఓటర్ ఎపిక్ కార్డ్ కాపీ, డ్యూటీ ఆర్డర్ కాపి, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. హెల్ప్ డెస్క్ సిబ్బంది కార్యాలయ పని వేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉంటారని తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్‌బీఐ బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న డీజీఎం శరత్‌రాజ్ తదితరులు

నగరంపాలెం: పోలీస్ ఉద్యోగులు అందరూ జీతాలకు సంబంధించి ఎస్‌బీఐ బ్యాంక్ అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ డీజీఎం ఎం.శరత్‌రాజ్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ)లో విధులు నిర్వర్తించే పోలీస్ కానిస్టేబుల్(పీసీ) సీహెచ్ శ్రీనివాసరావు(52) ఈ ఏడాది జనవరి 16న గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన రాష్ట్ర పోలీస్ శాఖ ఉద్యోగి కావడంతో అతను జీతానికి సంబంధించి బ్యాంక్ ఖాతా బ్రాడీపేట 2/14 ఎస్‌బీఐ ట్రెజరీ శాఖలో ఉంది. ఈ క్రమంలో ఎస్‌బీఐ అందించే పోలీస్ శాలరీ ప్యాకేజీ బీమా క్లైమ్ కింద రూ.5 లక్షలు, ఒక కోటి రూపాయల ప్రత్యేక బీమా, హోం లోన్ సురక్ష కింద రూ.6.11 లక్షల చెక్కులను శుక్రవారం బ్రాడీపేట శాఖలో శ్రీనివాసరావు భార్య పద్మజ, కుమారుడు సాయితేజకు గుంటూరు డీజీఎం ఎం.శరత్‌రాజ్, రీజినల్ మేనేజర్ ఫణికొండలరావు అందించారు. కార్యక్రమంలో ట్రెజరీ శాఖ చీఫ్ మేనేజర్ ఎం.అమరేంద్ర, డీఎం షేక్ బషీర్‌అహ్మద్, లైఫ్ మేనేజర్ వై.యుగంధర్ పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన ఉండాలి



అధికారులతో సమావేశమైన నగర కమిషనర్, తూర్పు ఆర్ఓ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు ఈవీఎంల వినియోగంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులు కేటాయించబడిన ఇంజినీరింగ్ అధికారులకు ఎన్నికల ప్రాసెస్, ఈవీఎంల నిర్వహణపై డెమో ఈవీఎంల ద్వారా శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల పని తీరుపై ఇంజినీరింగ్ అధికారులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్లు కమిషనింగ్, పోల్ సమయంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారం చేసేలా సిద్ధమవ్వాలన్నారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు తప్పనిసరిగా ఎన్నికల ప్రాసెస్‌పై అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల రోజు ఈవీఎంల్లో ఏ సమస్య ఎదురైనా తక్షణం పరిష్కారం చేసేలా శిక్షణలో మెలకువలు తెలుసుకోవాలని సూచించారు. లేకుండా పోలింగ్ రోజు ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. పనిచేసే పూర్తి అవగాహనతో సమస్యలు వచ్చిన వాటిని అధిగమించవచ్చని పేర్కొన్నారు. కావున అధికారులు తగిన విధంగా తెలుసుకోవాలని సూచించారు. శిక్షణలో ఏఆర్ఓ సునీల్ కుమార్, ఈఈ సుందర్‌రామిరెడ్డి, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు ప్రాణం పోయాలి

- ఐఐటీ రాపోర్, గౌహతి డైరెక్టర్ ఆచార్య రాజీవ్ అహూజ
- ఘనంగా ఎస్ఆర్ఎం 8వ రీసెర్చ్ డే వేడుకలు
- ఐదుగురు ప్రొఫెసర్లకు ఉత్తమ పరిశోధన అవార్డులు



జ్యోతి ప్రజ్వలన గావిస్తున్న ఆచార్య రాజీవ్ అహూజ, వీసీ మనోజ్

మంగళగిరి: యువ పరిశోధకులు, రీసెర్చ్ స్కాలర్లు నూతన సృజనతో ముందుకు రావాలని, కొత్త ఆవిష్కరణలకు ప్రాణం పోయాలని రాపోర్, గౌహతి ఐఐటీ డైరెక్టర్, శాస్త్రవేత్త ఆచార్య రాజీవ్ అహూజ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 8వ రీసెర్చ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన సభలో విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. దేశంలో ఐఐటీల ఉన్నతికి ప్రధాన కారణం పరిశోధనలేనన్నారు. పరిశోధన రంగంలో కాలు మోపుతున్న రీసెర్చ్ స్కాలర్లు సమూహంగా ఏర్పడి పరస్పరం తమ ఆలోచనలను చర్చించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లోనూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ప్రవేశ పెడుతుందని, దీని వల్ల మరింత సత్ఫలితాలు లభిస్తాయన్నారు. విశిష్ట అతిథి కోల్‌కతా యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ అమ్లాన్ చక్రవర్తి జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరా యూనివర్సిటీ ప్రగతిని, పరిశోధనలకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా పరిశోధనల్లో పురోగతి సాధిస్తున్న ఐదుగురు ప్రొఫెసర్లకు యూనివర్సిటీ యాజమాన్యం ప్రత్యేక అవార్డులను ప్రకటించింది. అవార్డు కింద ఒక్కొక్కరికీ రూ. 50వేల నగదు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, రీసెర్చ్ డే కన్వీనర్ డాక్టర్ ప్రత్యూతకుమార్ పాల్గొన్నారు.